క్లుప్తంగా

అధ్యాపకుడికి డాక్టరేట్


నాగతిమ్మయ్య

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న నాగ తిమ్మయ్య డాక్టరేట్ పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన కష్టమర్ల ప్రాధాన్యత, సంతృప్తి స్థాయి పదాలకు స్మార్ట్ ఫోన్ బ్రాండ్‌ల అధ్యయనం అనే అంశంపై గైడ్ రాఘవేంద్రకుమార్ ఆధ్వర్యంలో పరిశోధన పత్రం సమర్పించారు. దీంతో ఆయనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారన్నారు.

హుండీ సొమ్ము లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన సర్వనరసింహ్మస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. ఏడు నెలలకు సంబంధించిన చిన్న, పెద్ద హుండీల ద్వారా రూ. 7 లక్షలు ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈఓ నరసయ్య, భక్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం


సీఎంకు చెక్కును అందజేస్తున్న మౌలాలిరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని శ్రీగురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్, గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్ సంయుక్తంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.50 లక్షలు అందజేసినట్లు గురువారం డైరెక్టర్లు మౌలాలిరెడ్డి తెలిపారు. వరద బాధితులకు బియ్యం కూడా పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఖలీల్ ఆత్మహత్య కారకులను శిక్షించాలి


ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఆన్‌లైన్ మోసాల బారిన పడి సలీంనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సయ్యద్ ఖలీల్ అహమ్మద్ ఆత్మహత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ముస్లిం జేఏసీ కన్వీనర్ గన్ని అబ్దుల్‌కరీం కోరారు. గురువారం జేఏసీ నాయకులతో కలిసి ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఖలీల్ అహమ్మద్ రాసిన మరణ వాంగ్మూలం ఆధారంగా ఆన్‌లైన్ కంపెనీ, యజమానులు ఎవరో కనుగొని కఠినంగా శిక్షించాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సర్దార్‌ఖాన్, ఇద్రూస్ షేక్, జుబేర్, ఖాజాబాబా పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలు అవసరం

చాగలమర్రి: విద్యతో పాటు క్రీడలు కూడా ఏంతో అవసరమని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం కోటయ్య, ఎస్ఎంసీ చైర్మన్ గౌస్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను కన్వీనర్ పీడీ దాదా పీర్ నిర్వహించారు.

క్రీడల్లో రాణించాలి

ఆళ్లగడ్డ : ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాశాఖాధికారిని శోభావివేకవతి అన్నారు. స్థానిక వైపీపీఎం ప్రభుత్వ కళాశాల ఆవరణలో గురువారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంఈఓ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. హెచ్ఎం వీరరాఘవయ్య, ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్లు ప్రభాకర్, నాగేంద్ర, పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎస్పీజీ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

నంద్యాల(అర్బన్): రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ, శివసేన(షిండేవర్గం) నాయకులు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీని చంపాలంటూ స్టేట్‌మెంట్లు ఇస్తున్న ఆయా పార్టీల నాయకుల తీరుకు నిరసనగా గురువారం నూనెపల్లెలోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఊకొట్టు వాసు, ఆనందరావు, ప్రసాద్, రవి, పాల్‌రాజ్, సలాం పాల్గొన్నారు.

ధరల వల.. సామాన్యుడు విలవిల!

- నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పైపైకి
- నూనెల ధర పెరుగుదలతో ప్రజలపై మరింత భారం
- అదే దారిలో గుడ్డు కూడా..
- ధరలు తగ్గించకపోగా పెంచుతున్న ప్రభుత్వం
- తగ్గుతున్న వినియోగస్థాయి
- పెరగని కష్టజీవి వేతనం


నిత్యావసర సరుకులు


కోడిగుడ్లు పెరిగిన కూరగాయాలు ధరలు

నంద్యాల(వ్యవసాయం): గతంలో ఎన్నడూ లేని రీతిలో నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. మధ్యతరగతి, పేదల ఇళ్లలో కందిపప్పు లేనిదే రోజు గడవదు. అలాంటి కందిపప్పు కేజీ రూ.170 దాటిపోయింది. పచ్చడి మెతుకులైనా తిందామా అంటే ఉల్లిగడ్డ నిప్పులా మారింది. నెల రోజులుగా కేజీ రూ.80 నుంచి దిగనంటోంది. మధ్యతరగతి కుటుంబాల్లో నిత్యం వాడే మినపప్పు రూ.150కి పైగాను పలుకుతోంది. దీంతో కనీసం ఇడ్లీ, దోశ తినడానికి కూడా జంకుతున్నారు. చివరకు చింతపండు కూడా రూ.220 వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఇక తిరమాత వేసుకుందామంటే కిలో వెల్లుల్లి రూ.350 పలుకుతోంది. ఏ సరుకు కొందామన్నా ధరల షాక్ కొడుతుండటం, తమ వేతనం మాత్రం పెరగపోతుండటంతో సంపాదనంతా.. సరుకులకే సరితే మిగిలిన అవసరాలకు ఏమి చేయాలో పాలుపోని స్థితి. దీంతో వినియోగస్థాయిని తగ్గిస్తున్నారు.

పెరిగిన దిగుమతి సుంకం..

కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాలను పెంచుతూ ప్రకటన చేసింది. ఈ ప్రభావంతో మార్కెట్లో ఒక్కసారిగా నూనెల ధరలు భగ్గుమన్నాయి. ఎడిబుల్, క్రూడ్ ఆయిల్స్‌పై 20 శాతం సుంకం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. అయితే ఈ విధి విధానం వచ్చే నెల 1వ తేదీ నుంచి అమలు కానుందని ప్రకటించినప్పటికీ హోల్‌సేల్ వ్యాపారులు, ఆయిల్ ఏజెన్సీలు ఇప్పటికే పెరిగిన ధరలకు విక్రయిస్తున్నారు. తమ దగ్గరున్న పాత స్టాక్‌నే కొత్త ధరలతో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం నూనెల ధరలు పెంచుతున్నట్లు చెప్పడంతోనే వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అందిన కాడికి దండుకుంటున్నారు.

కాగుతున్న వంట నూనెలు..

రీఫైండ్ ఆయిల్ అటుంచితే పామాయిల్ లాంటివి కూడా కొండెక్కి కూర్చోవడంతో సామాన్యులకు చుక్కలు కనిపిస్తున్నాయి. సన్‌ఫ్లవర్, వేరుశనగ ఇలా ఏదైనాసరే లీటర్ ప్యాకెట్లు రూ.140కి పైగానే పలుకుతున్నాయి. చివరకు పామాయిల్ రూ.130 కంటే తక్కువగా లభించడం లేదు. వీటి ధరలు అమాంతం పెరగడంతో మార్కెట్లోకి కల్తీ నూనెలు వచ్చాయి. పదే పదే వాడిన నూనెలు రీసైకిల్ చేసి సీసాల్లో రూ.70 లేదా రూ.80 అమ్ముతుంటే పేదలు వాటిని కొంటున్నారు.

ఆకాశాన్నంటుతున్న కూరగాయలు..

కూరగాయలు ఒకటీ రెండు మినహా మిగతావన్నీ కేజీ రూ.60కు తక్కువ లేవు. ఉల్లి రూ.70కి పైగా పలుకుతుండగా క్యారెట్, బీన్స్ వంటివి కేజీ రూ.60కి విక్రయిస్తున్నారు. ఎండు మిర్చి రూ.200 దాటింది. చింతపండు చివరి రకం రూ.140 తక్కువ లేదు. ఒక్క పచ్చిమిర్చి, టమాట మినహా మిగతావన్నీ రూ.60 పైమాటే ఉన్నాయి. రూ.200 తీసుకుని మార్కెట్‌కు వెళితే నాలుగైదు రకాల కూరగాయలు కూడా తెచ్చుకోలేని దుస్థితి నెలకొంది. కూరగాయలు కొనలేక గుడ్డు తిందామంటే డజన్ 80 చెబుతున్నారు. రిటైల్‌గా ఒకటి రూ.7, రూ.8 ప్రకారం అమ్ముతున్నారు. ధరల నియంత్రణ చేపట్టకపోవడంతో మార్కెట్‌లో దళారులదే రాజ్యమైంది. పండించే వాళ్ల తక్కువకు ఇస్తున్నా రిటైలర్లు భారీ ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ధరలను తగ్గించాల్సిన ప్రభుత్వం వివిధ రకాల పేర్లతో సుంకాలు విధిస్తుండటంతో రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. ధరలు పెరుగుతున్నా ఉద్యోగి జీతాలు పెరగకపోవడంతో వచ్చే జీతం ఏపాటికీ చాలక వినియోగస్థాయిని తగ్గించుకుంటున్నారు.

రిటైల్ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఇలా..

సరుకులు (కేజీ)	ధర
కందిపప్పు	రూ.160
శనగపప్పు	రూ.120
మినప్పప్పు	రూ.140
వేరుశనగ	రూ.140
గోధుమలు	రూ.45
పామాయిల్	రూ.130
సన్‌ఫ్లవర్	రూ.140 (లీ.)
పాలు లీటరు	రూ.70
ఎండుమిర్చి	రూ.200
క్యారెట్	రూ.60
బీన్స్	రూ.80
చింతపండు	రూ.220
ఉల్లిగడ్డలు	రూ.70
గుడ్లు డజన్	రూ.80
వెల్లుల్లి	రూ.350


లూజ్ నూనె విక్రయిస్తున్న దృశ్యం

సరుకులు కొనలేకున్నాం



సరుకుల కోసం చేతి నిండా డబ్బులు ఖర్చు చేస్తున్నా సరుకుల సంచి మాత్రం నిండలం లేదు. కొంత కాలంగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గతంలో రూ.85 ఉండే నూనె నేడు రూ.140కి చేరింది. ఇలాగే నిత్యావసర సరుకుల ధరలన్నీ కొండెక్కాయి. దీంతో ఏమి తినాలన్నా పేద వారికి ఇబ్బందిగా ఉంది. ధరలను అదుపు చేయకపోతే జనం పౌష్టికాహారం సంగతి అటుంచి తినడానికి కూడా భయపడేలా ఉన్నారు. – మహాలక్ష్మి, గృహిణి, నంద్యాల

ఆర్థిక భారం పెరిగింది



రోజురోజుకు ఇళ్లలో ఖర్చులు అధికం అవుతున్నాయి. పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఒక్కోసారి ఒక్కో రేటు చెబుతున్నారు. ధరలు అమాంతంగా పెరిగిపోతున్నా, వేతనాలు ఇంచు కూడా కదలడం లేదు. దీంతో మా లాంటి మధ్య తరగతి వాళ్ల నిత్యావసర సరుకులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. మంచి నూనెతో పాటు కందిబేడలు, ఉల్లి, ఇతర కూరగాయలు, సరుకుల ధరలన్నీ పెరిగిపోయాయి. ఆర్థిక భారం అధికమైంది. – నాగేశ్వరరెడ్డి, రైతు, ఎర్రగుంట్ల, బండిఆత్మకూరు మండలం

కడుపునిండా తినలేని పరిస్థితి



సామాన్య, పేద, మధ్య తరగతి వారికి అనుకూలంగా నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలను ప్రభుత్వం నియంత్రణ చేయాలి. ఎన్నికల ముందేమో నిత్యావసర సరుకుల ధరలను పెంచబోమని చెప్పి.. ఎన్నికల అనంతరం ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. పేదలకు అందుబాటులో ఉండేలా ధరలను తగ్గించాలి. పేదలు కడుపునిండా తినలేని పరిస్థితి కల్పిస్తున్నారు. – లక్ష్మీదేవమ్మ, నంద్యాల

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జట్ల ఎంపిక


బాలుర జట్టు


బాలికల జట్టు

శిరివెళ్ల: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా బాలుర, బాలికల జట్లు ఎంపికయ్యాయి. ఈ మేరకు గురువారం యర్రగుంట్లలో హ్యాండ్‌బాల్ జిల్లా అసోషియేషన్ కార్యదర్శి మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఈ నెల 21,22 తేదీలలో వైఎస్సార్ జిల్లా వేంపల్లెలో జరగనున్న 38వ ఏపీ స్టేట్ హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ అండర్ –15 విభాగాలకు జట్లు ఎంపికయ్యారన్నారు. జిల్లాలోని పాఠశాలలకు చెందిన బాల, బాలికలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు సర్దార్, మెహరిజా, గైబావలి పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజావేదిక

గోస్పాడు: ఈనెల 20వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రజావేదిక పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగ అనసూయ తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తవుతున్న సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై కరపత్రాలతో ఇంటింటికీ తిరిగి సచివాలయ సిబ్బంది వివరిస్తారని చెప్పారు. 26వ తేదీ వరకు గ్రామాల్లో ప్రజా వేదిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామాల వారీగా..20న దీబగుంట్ల, జూలేపల్లె, 21న గోస్పాడు, కానాలపల్లె, 22న జిల్లెల్ల, ఎం.కృష్ణాపురం, 23న ఎం.చింతకుంట్ల, నెహ్రూనగర్, 24న పసురపాడు, ఎస్.నాగులవరం, 25న రాయపాడు, తేళ్లపురి, 26న సాంబవరం, ఒంటివెలగల, యాళ్లూరు గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ప్రత్యేక అధికారులుగా మండల స్థాయి అధికారులను నియమించారని వివరించారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు ప్రజా వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామ స్థాయిల్లో ప్రజావేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 20న మునగాల, పులిమద్ది, 21న అయ్యలూరు, భీమవరం, బిల్లలాపురం, 23న బ్రాహ్మణపల్లె, చాబోలు, చాపిరేవుల, 24న గుంతనాల, కానాల, కొత్తపల్లె, 25న పెద్దకొట్టాల, పాండురంగాపురం, పోలూరు, 26న మిటాన్దల, పుసులూరు, రాయమాల్పురం గ్రామాల్లో ప్రజావేదిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

23నుంచి ప్రజావేదిక కార్యక్రమం

దొర్నిపాడు: గ్రామ పంచాయతీల్లో ఈనెల 23నుంచి ప్రజావేదిక ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు. 23న అమ్మిరెడ్డినగరం, అర్జునాపురం, బుర్రారెడ్డిపల్లె, 24న చాకరాజువేముల, దొర్నిపాడు, గుండుపాపల, 25న కొండాపురం, క్రిష్టిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె, 26న రామచంద్రాపురం, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు.

స్వచ్ఛతా హీ సేవలపై ప్రతిజ్ఞ


రుద్రవరం మండల పరిషత్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


సచివాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, అధికారులు

రుద్రవరం: స్వచ్ఛతా హీసేవ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏఓ వరలక్ష్మి, పీఆర్ ఏఈ వెంకటరాముడు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రతిజ్ఞ చే శారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తూ ఇరుగు పొరుగు వారిని అదే బాటలో నడిపించి స్వచ్ఛతకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అలాగే అటవీ అధికారులు నర్సాపురం మార్తోమ పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో ముర్తుజావలి, ఎఫ్ఎస్ఓ మక్తర్ బాషా, ఎఫ్‌బీఓలు రామకృష్ణ, ఖాన్, నాగేంద్ర, సురేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: గ్రామాల్లో చెత్తను పూర్తిగా తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య చర్యలు స్థానికులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా పారిశుద్ధ్యం లోపించిన ప్రాంతాల్లో వేస్ట్‌ఆయిల్, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు.

స్వచ్ఛతాహీ సేవలో ప్రజలు భాగస్వాములు కావాలి

చాగలమర్రి: కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో పరిశుభ్రత కోసం నిర్వహిస్తున్న స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలి ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓపీఆర్డీ తాహీర్ హుసేన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద స్వచ్ఛతపై అధికారులు ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలు అపరిశుభ్రం చేయమని, ఇతరులను చేయనివ్వమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసమ్మ, మండల పరిషత్, గ్రామ పంచాయితీ, ఉపాధి హామీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

గోస్పాడు: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన మురళీమోహన్‌రెడ్డి (47) కిడ్నీలు పాడవడంతో డయాలసిస్ చికిత్స పొందుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఈనెల 15న రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా.. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రి తరలించగా మెరుగైన వైద్యం కోసం అక్కడి వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలులో చికిత్స పొందుతూ ఆయన కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య రామతులశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మద్దిలేటి వివరించారు.

విశ్వశాంతి కోసం ప్రణవనాదం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పట్టణంలోని బైర్మల్ వీధిలో వెలసిన శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో విశ్వశాంతి కోసం ఓంకార (ప్రణవ)నాదాన్ని గురువారం శ్రీవాసవీ విష్ణు సహస్ర నామ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త మద్దయ్య స్వామి,వాసవీ మహిళా సంఘం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం

నంద్యాల(అర్బన్): వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.20వేల చెక్కును నంద్యాల పట్టణ సాయి యువసేన సంస్థ నిర్వాహకులు జిల్లా కలెక్టర్ రాజకుమారికి గురువారం ప్రెసిడెంట్ రవి ఆధ్వర్యంలో అందజేశారు.

స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక రూపొందించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ 2047లో భాగంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించి నవంబరు 1న ఆవిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖాధిపతులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, సీపీఓ వేణుగోపాల్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగంగా అన్ని శాఖల నుంచి ప్రణాళికలు తెప్పించుకోవాలని సీపీఓకు సూచించారు. సెప్టెంబరు 30 నాటికి మండల వారీ ప్రణాళికలు, అక్టోబరు 15లోగా జిల్లా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

పోలీసుల పేరుతో డాక్టర్‌కు టోకరా

ధర్మవరం అర్బన్: తాము ముంబయి పోలీసులమంటూ బెదిరించి ధర్మవరంలోని ఓ వైద్యుడి నుంచి రూ.33 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ వి.రత్న వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 18న ధర్మవరానికి చెందిన డాక్టర్ తరుగు సూర్యనారాయణరెడ్డికి 9177597242 నంబర్‌తో వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. ఆగంతకుడు తాను ముంబయి పోలీసు విభాగం నుంచి మాట్లాడుతున్నట్లుగా తెలిపాడు. నరేష్ గోయల్ అనే వ్యక్తి కెనరా బ్యాంకు ద్వారా రూ.500 కోట్లు అప్పుగా తీసుకుని, ఆ డబ్బు సంస్థకు వాడకుండా వివిధ ఖాతాల్లో జమ చేశాడని, ఇందులో మీ అకౌంట్ కూడా ఉందంటూ డాక్టర్‌ను బెదిరించాడు. రూ.20 లక్షలు తీసుకున్నట్లుగా కేసు నమోదైనట్లుగా తెలిపాడు. డాక్టర్ నమ్మకపోవడంతో డాక్టర్‌కు సంబంధించి తన వద్ద ఉన్న నకిలీ ఆధార్ కార్డు, నకిలీ బ్యాంక్ స్టేట్‌మెంట్, ఫేక్ డెబిట్‌కార్డు చూపించి నమ్మించాడు. ధర్మవరానికి వచ్చి డాక్టర్‌తో పాటు కుటుంబసభ్యులనూ అరెస్ట్ చేసి ముంబయికి తీసుకెళ్తామని బెదిరించాడు. ఈ కేసు నుంచి బయటపడాలంటే రూ.33 లక్షలు చెల్లించాలని సూచించాడు. అప్పటికే బెంబేలెత్తిన డాక్టర్ అనాలోచితంగా ఆగస్టు 20న స్థానిక బ్యాంక్ ఖాతా నుంచి రూ.20 లక్షలను ఆర్‌టీజీఎస్ ద్వారా వారు చెప్పిన బ్యాంకు ఖాతా 8856210000018823 (మంగమద్దల ఎంటర్‌ప్రైజెస్)కు బదిలీ చేశాడు. అనంతరం ఐడీబీఐ నుంచి అదే అకౌంట్‌కు మరో రూ.13 లక్షలు జమ చేశాడు. రెండు రోజుల తర్వాత తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు నిర్ధారించుకుని ఆగస్టు 22న ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం సీఐ తిమ్మారెడ్డి పక్కా ఆధారాలతో సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దాసి ఇలియాజర్, పుట్లంపల్లి మండలం శివానందపురం గ్రామానికి చెందిన నగలరాపు స్వామిదాసు, నంద్యాల జిల్లా అయ్యలూరు మెట్టకు చెందిన మంగమద్దెల ప్రహ్లాద్, ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామానికి చెందిన బెలగడ కిశోర్, నంద్యాలలోని వెంకటచాలం కాలనీకి చెందిన అల్లు అంబిరెడ్డి, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడపల్లి గ్రామానికి చెందిన జావీద్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసులు, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి క్రీడా పోటీలు

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం విద్యార్థులకు మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహుడు, ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పోటీల నిర్వహణపై ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అండర్–14, 17 విభాగాలకు చెందిన విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర పోటీలు ఉంటాయన్నారు.

3,097 హెక్టార్లలో పంటల సాగు

ఉయ్యాలవాడ : ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 2,675 హెక్టార్లు కాగా 3,097 హెక్టార్లలో రైతులు వివిధ పంటలు సాగు చేశారని ఏఓ రాజేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 2,497 మంది రైతులు సాగు చేసిన 2,008 హెక్టార్లకు సంబంధించి ఈ –పంట నమోదు చేశామన్నారు. ఈ పంట నమోదు చేయించుకోని రైతులు ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈ నెల 23వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని ఏఓ సూచించారు.

నాటుసారా బట్టీ ధ్వంసం

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు బట్టీని ధ్వంసం చేశామని ఎస్ఐ వరప్రసాదు గురువారం తెలిపారు. మండలంలోని హరినగరానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో కొందరు నాటుసారా బట్టీ ఏర్పాటు చేసినట్లు సమాచారం అందడంతో సిబ్బందితో అక్కడికి వెళ్లామన్నారు. ఐదు డ్రమ్ముల్లో నిల్వ ఉన్న 500 లీటర్ల బెల్లం ఊటను, ప్లాస్టిక్, డ్రమ్ములు, సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. విచారణ చేసి నిందితులను అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: స్థానిక బెస్త కాలనీకి చెందిన లక్ష్మీదేవి వివాహిత గురువారం ఇంటి ఎదుట కల్లాపుజల్లే పొడిని నీటిలో కలుపుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్య శాలకు తరలించినట్లు కాలనీ వాసులు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

చాగలమర్రి: మండలంలోని తోడేండ్లపల్లె గ్రామానికి చెందిన రైతు రమణ గడ్డివామి గురువారం అగ్నికి ఆహుతి అయ్యింది. సొంత కల్లంలో వేసిన రూ.50 వేల విలువ గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని బాధిత రైతు ఆరోపించాడు.

అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి

ఆళ్లగడ్డ : నియోజకవర్గంలోని రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో గురువారం ల్యాబ్ టెక్నికల్ ఇన్‌స్ట్రక్టర్ నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో ఏడీఏ మాట్లాడారు. రైతులు సాగుకు ముందు తమ వద్ద ఉన్న వాటితో పాటు అప్పటికప్పుడు కొనుగోలు చేసిన విత్తనాలను, రసాయనిక ఎరువులను ల్యాబ్‌లో ఉచితం పరీక్ష చేయించుకునే అవకాశం ఉందన్నారు. రైతులతో పాటు, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ల్యాబ్‌లో పరీక్షల కోసం సేకరించిన రసాయనిక ఎరువుల నమూనాలను వేలంపాటలు నిర్వహించగా అధికంగా పాట పాడిన రైతులకు వాటిని అందజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆళ్లగడ్డ : పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నల్ల బజారుకు తరలిసుండగా విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ ప్రసాద్ తెలిపిన వివరాలు ..పట్టణంలోని పాత కందుకూరు రహదారిలో వాహనంలో అక్రమంగా బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి 130 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు విచారణ చేపట్టగా.. పట్టణంలోని యాదవ వీధికి చెందిన నాగన్నకు చెందినవిగా గుర్తించామని ఆర్ఐ వివరించారు.

పౌష్టికాహారంపై అవగాహన

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని ఎస్‌పీజీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పౌష్టికాహార ప్రాముఖ్యత, రక్తహీనతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఇమ్మానియోలు సుజీవ్, అంగన్‌వాడీ కార్యకర్తలు అసనమ్మ,ఆశీర్వాదమ్మ, అరుణజ్యోతి పాల్గొన్నారు.

నకిలీ స్కౌట్స్, గైడ్ కార్యకలాపాలపై చర్యలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో నకిలీ స్కౌట్స్, గైడ్‌సంస్థలు అనధికారికంగా పాఠశాలల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని సమాచారం అందిందని, కొనసాగితే చర్యలు తప్పవని డీఈఓ సుధాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూస్థాన్ స్కౌట్స్, గైడ్స్ ఆర్గనైజేషన్ తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తూ పాఠశాలల్లో కార్యకలాపాలు నిర్వహించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రపంచ స్కౌట్ ఉద్యమం వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ గర్ల్స్ గైడ్ అండ్ గర్ల్స్ స్కౌట్ అనుబంధ సంస్థగా ఉన్న భారత్ స్కౌట్స్ గైడ్స్ మాత్రమే అనుమతించబడిన సంస్థ అన్నారు. ఇతర సంస్థలకు అనుమతి లేదన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏదైనా సంస్థలు కార్యక్రమాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉంటూ విద్యార్థులకు నకిలీ సంస్థల వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కలిగించాలని సూచించారు.

పర్యావరణ పరిక్షణతో ఆరోగ్యం

నంద్యాల(రూరల్): పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం పదిలం అని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ 2024 కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పర్యావరణ పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఎంహెచ్ఓ అంకిరెడ్డి, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): పరిశుభ్రతవైపు వేసే ప్రతి అడుగుకు దేశాభివృద్ధికి పునాది అని నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త అన్నారు. పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో స్వచ్ఛతాహీ సేవ మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. సీఐ మాట్లాడుతూ ఎక్కడ పరిశుభ్రత ఉంటుందో అక్కడ ఆరోగ్యం ఉంటుందన్నారు. విద్యార్థులు పరిశుభ్రత పెంపొందించాలని సూచించారు. రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.